సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 24 | నవంబర్ | 2024



పరీక్షలు సాగేనా..ఆగేనా? - 8లో▸
కేయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని యాజమాన్యాలు బంద్‌ను కొనసాగిస్తున్నాయి.



ఘాతుకానికి పాల్పడిన వారిని వదలం
అమాయకులను హత్య చేసిన మావోయిస్టులను వదిలి పెట్టమని ములుగు ఎస్పీ శబరీష్ అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $28^0/14^0$
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఉదయం పొగమంచు, రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



మరిపెడ: పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కార్గిల్ సెంటర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కార్గిల్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం పిచ్చికుక్క అటుగా వెళ్తున్న మరిపెడ మండలానికి చెందిన మెరుగు సంజీవ, మాలోతు అనిల్, ధారవత్ కొమరెల్లి, బానోతు నాగులు, దుర్గాప్రసాద్, ఖమ్మం జిల్లాకు చెందిన బొబ్బ సంజీవరెడ్డిని కరిచింది. వెంటనే వారు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి యాంటీరేబిస్ ఇంజక్షన్లు వేయించుకున్నారు. మెరుగైన చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ గుగులోతు రవికుమార్ తెలిపారు.

గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

మహబూబాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ములుగు, మానుకోట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులను డిసెంబర్ మాసంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు శిక్షణా తరగతులకు హాజరు కావడానికి పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలి



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎఫ్ఏక్యూ నార్మ్స్ అనుసరించి ధాన్యం కొనుగోళ్లు జరపాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి అన్నారు. మండలంలోని ముడుపుగల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శుద్ధి చేసిన ధాన్యాన్ని ఎఫ్ఏక్యూ నార్మ్స్ అనుసరించి తేమ శాతం వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే బాగుంటుందన్నారు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ వెంట డీఎస్ఓ ప్రేంకుమార్, ఏపీఎం తిలక్ తదితరులు ఉన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

మహబూబాబాద్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ప్రతీ నెల రూ.3000 చొప్పున పింఛన్ మీడియా అకాడమీ ద్వారా అందచేయడం జరుగుతుందని డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలు ఈ సంవత్సరం 2024–25 సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను డీపీఆర్వో కార్యాలయంలో ఈనెల 26వ తేదీలోపు అందజేయాలని కోరారు.

ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ తనిఖీ



నెహ్రూ సెంటర్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ మురళీధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఆస్పత్రి యాజమాన్యం ఆస్పత్రి ఆవరణలో ధరల పట్టికను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలను అమర్చుకోవాలన్నారు. జిల్లాలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, ఎవరైనా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలన్నారు. తనిఖీల్లో పొరపాట్లను గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక.. అనుబంధాల వనభోజనం

కార్తీక మాసంలో ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్రదాయం

- వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఐక్యతను చాటేలా కార్యక్రమాలు.. ఆటపాటలతో వనమంతా సందడే
- నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వనభోజనాలు

హన్మకొండ కల్చరల్ :

కార్తీక మాసం అనేక విశేషాల పవిత్రమైన మాసం. ఈ మాసం వచ్చిందంటే చాలు వనభోజనాల సందడి కనిపిస్తుంది. అందరూ భక్తి భావంతో పూజలు చేస్తూ సరదాగా ఆట, పాటలతో గడుపుతారు. ఉసిరి చెట్టునీడన భోజనం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కులాలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వనభోజనాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్తీక మాసంలో వనభోజనాల ప్రత్యేకతలపై ఈ వారం ప్రత్యేక కథనం.

వనంతోనే ఆనందం..

కార్తీక మాసం వనభోజనం అంటే ఎక్కడపడితే అక్కడ చేసే కార్యక్రమం కాదు. వనభోజనానికి ఆహ్లాదకరమైన ప్రదేశం అత్యంత పవిత్రంగా ఉండాలి. వనభోజనాలకు రకరకాల ఫల, పుష్ప, వృక్షాలు కలిగిన ఏటి ఒడ్డున ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవడం ఉత్తమం. అక్కడ తప్పనిసరిగా ఉసిరి చెట్టు ఉండాలి. తులసి వంటి మొక్కలు కూడా ఉంటే మరీ మంచిది. బయట నుంచి తెచ్చినవి కాకుండా ఆహార పదార్థాలు అక్కడే వండుకోవాలి. సాత్విక ఆహారాన్ని తీసుకోవడం మేలు. ఉసిరి చెట్టు కింద సాలగ్రామం పెట్టి కార్తీక పూజలు చేయాలి. తర్వాత విస్తరాకుల్లో గానీ అరిటాకుల్లో గానీ అందరూ కలిసి భోజనం చేయాలి. ఇలా అందరూ కలిసి పనిచేయడంలో సహకార స్ఫూర్తి మనకు కనిపిస్తుంది.

ఆరోగ్య రహస్యం..

ప్రతీ ఆధ్యాత్మిక కార్యక్రమం వెనుక ఒక ఆరోగ్య రహస్యం ఉంటుంది. ముందు శ్రావణ, భాద్రపద మాసాలు వర్ష రుతువు కావడంతో ఆ నెలల్లో కురిసిన వర్షాలకు నేల మీద ఎన్నో మొక్కలు జీవం పోసుకుని కార్తీక మాసం వచ్చేసరికి చక్కగా పెరుగుతాయి. కార్తీక మాసంలో చీకటి పడిన తర్వాత కొంచెం చలి ప్రారంభమవుతుంది. కానీ, పగలు అటు ఎండ ఎక్కువగా లేకుండా, ఇటు మంచు పడకుండా ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇటువంటి వాతావరణంలో వర్ష రహితంగా అందరూ కలిసి జరుపుకునే వన సమారాధనల వల్ల వ్యక్తులు, కుటుంబాల మధ్య సమైక్యత ఏర్పడుతుందన్నది నమ్మకం. ఆ విధంగా ఆధ్యాత్మికం, ఆరోగ్య శాస్త్రాల మేళవింపుగా మన పూర్వీకులు ఏర్పరచినవే వన సమారాధనలు (వనభోజనాలు).



కార్తీక వనభోజనాలు (ఫైల్)

సండే స్పెషల్



పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాసాచార్యస్వామి (ఫైల్)

ఉసిరి, తులసి మొక్కలకు పూజలు



వనభోజనాల సందర్భంగా కొన్ని ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాలను నిర్దేశించారు. వనభోజనం ఉసిరి చెట్టు ఉన్న చోట చేయాలి. ఉసిరి చెట్టును విష్ణుమూర్తికి ప్రతిరూపంగా పురాణాల్లో పేర్కొన్నారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన ఈకార్తీక మాసంలో ఉసిరి చెట్టు దగ్గర లక్ష్మీదేవి ప్రతిరూపమైన తులసి మొక్కను ఉంచి పూజించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, లక్ష్మీనారాయణ ఆశీస్సులతో సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. అందుకే అనేక మంది ఉసిరి చెట్టు లేకపోతే ఉసిరి కొమ్మను తీసుకు వచ్చి ఒకచోట గుచ్చి దానికి పూజ చేసి అనంతరం అక్కడ సామూహికంగా వనభోజనం చేస్తారు.

నేడు వనభోజనాలకు సర్వం సిద్ధం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కులాల వారీగా ప్రజలు వనభోజనాలకు సర్వం సిద్ధమయ్యారు. ఆలయాలు, పార్కులు, చుట్టుపక్కల ఉన్న పండ్ల తోటలు, విశాలమైన ప్రదేశాల్లో ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా త్రికోట పరిసరాలు, వనవిజ్ఞాన కేంద్రం, ఏకశిల చిల్డ్రన్స్ పార్కు, వరంగల్ కోటి లింగాల దేవాలయం, ఖిలావరంగల్ వాకర్స్ మైదానంలో పద్మశాలీలు, గౌడ, మున్నూరు కాపు, ఆర్యవైశ్య, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు.



ఆటలు.. పాటలు..

కార్తీక వనభోజనాల్లో తమ తమ కమ్యూనిటీలో మంచిచెడులను చర్చించుకుంటారు. అందరూ కలిసి ఐక్యతను చాటేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెద్దలు, పిల్లలు వేర్వేరుగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీని వల్ల రోజువారీ పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఆటలపోటీల్లో రాణించిన వారికి బహుమతులను అందజేయడం వల్ల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఒకరు చెప్పారు.

సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని మేలుకొల్పుతాయి



కార్తీక సమారాధనలు సర్వమానవ సమానత్వాన్ని సౌభ్రాతృత్వాన్ని మేలుకొల్పుతాయి. ధాత్రినారాయణస్వామిని (ఉసిరిక చెట్టు), లక్ష్మీ స్వరూపమైన (తులసి చెట్టు)ను ప్రతిష్ఠించి పూజలు చేయాలి. అక్కడ కార్తీక వనభోజనాలు చేయడం శ్రేయస్కరం. వస్త్ర, సాలగ్రామ, దీప దానాలు చేయడం ఉత్తమం.

\- ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ధర్మప్రవచకులు

ఐక్యత చాటేందుకే వనభోజనం



కమ్యూనిటీ వాళ్లు ఎక్కడెక్కడో ఉంటారు. కార్తీక మాసంలో నిర్వహించుకునే వనభోజనాల కార్యక్రమం ఆధ్యాత్మికత సంతరించడమేకాకుండా మనలో ఐక్యత చాటుతుంది. వనం వల్ల మానసిక ప్రశాంతత, పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొంది, వృద్ధులకు ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

\- శామంతుల శ్రీనివాస్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు

సరదాగా గడుపుతాం..



ఖిలా వరంగల్ ఏకశిల చిల్డ్రన్స్ పార్కులో గౌడ కుల బంధువులతో కలిసి నేడు (ఆదివారం) వనభోజనం ఏర్పాటు చేశాం. అందరం ఒకేచోట కలుసుకునే అరుదైన వేదిక ఇది. గౌడల ఆరాధ్య దేవుళ్లను పూజించుకుంటాం. వనసమారాధన చేస్తాం. పిల్లలు, పెద్దలు కలిసి సరదాగా గడుపుతాం.

\- డాక్టర్ చిర్ర రాజుగౌడ్, గౌడ (గోపా) జిల్లా అధ్యక్షుడు



డీజీపీ జితేందర్ చేతుల మీదుగా రివార్డు స్వీకరిస్తున్న మహబూబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, మరిపెడ ఎస్సై సతీష్, బయ్యారం ఎస్సై తిరుపతి

పోలీస్ అధికారులకు రివార్డులు

- రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక శిక్షల ఖరారు జిల్లాగా మానుకోట

మహబూబాబాద్ రూరల్: గంజాయి సాగు, అక్రమ రవాణా, క్రయవిక్రయాల జోలికి వెళ్తే తప్పనిసరిగా శిక్ష అనుభవించాల్సిందేనని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రివార్డు మేళా నిర్వహించారు. గంజాయి కేసుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ శిక్షలు ఖరారు చేసిన జిల్లాగా మహబూబాబాద్ పేరు సాధించింది. ఇందులో భాగంగా డీజీపీ జితేందర్ చేతులమీదుగా మహబూబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, మరిపెడ ఎస్సై సతీష్, బయ్యారం ఎస్సై తిరుపతి రివార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి కేసులకు సంబంధించి ఎక్కువ శిక్షలు ఖరారు కావటం అభినందనీయమన్నారు. 11 గంజాయి కేసుల్లో 39 మందికి జైలుశిక్ష ఖరారు కాగా, రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక శిక్షల ఖరారు జిల్లాగా పేరు సాధించిందన్నారు. గంజాయి కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేవిధంగా విధులు నిర్వర్తించి ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

టెన్త్‌లో మొదటిస్థానంలో నిలవాలి

- నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వసతి గృహాల్లో రుచికరమైన భోజనంతో పాటు, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలు, వసతి గృహాల్లో అందిస్తున్న సేవలపై తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

మహబూబాబాద్ అర్బన్: వసతి గృహాల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం రాత్రి మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ఎస్టీ హాస్టల్‌ను సందర్శించి కిచన్ రూం, కూరగాయలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓ యాకూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుచికరమైన భోజనం అందించాలని వార్డెన్ మోహన్‌నాయక్‌ను ఆదేశించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



నెట్‌బాల్ క్రీడలను ప్రారంభిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి

కేసముద్రం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా చైర్మన్, డీఈఓ రవీందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కల్వల జెడ్పీహైస్కూల్ ఆవరణలో 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల నెట్‌బాల్ పోటీలను, గట్కా క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఎదుగుదలకు సోపానాలన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయమని, దీంతో గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందుతుందన్నారు. అనంతరం నిజామాబాద్, వరంగల్ జిల్లా జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ క్రాంతి, ఎస్సై మురళీధర్‌రాజు, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ మందుల శ్రీరాములు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు పీవీ రమణ, కృష్ణమూర్తి, రమేష్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి దిగుబడిలో దేశంలోనే నంబర్ వన్

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

చిన్నగూడూరు: కాళేశ్వరంలో నీళ్లు లేకపోయిన కోటి 60 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి సాధించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నగూడూరు, గుండంరాజుపల్లి, జయ్యారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సకాలంలో మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. త్వరలోనే రైతుల అకౌంట్లో రైతుబంధు నిధులు జమ చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, వ్యవసాయ అధికారి భాస్కర్, ఏపీఎం పాపయ్య, తెలంగాణ ఆయిల్‌పామ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ వల్లూరి కృష్ణారెడ్డి, నాయకులు మూల మురళీధర్ రెడ్డి, గునిగంటి కమలాకర్, పిల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- డీపీఓ హరిప్రసాద్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ హరిప్రసాద్

గార్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ వసతిగృహాల వార్డెన్లను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గార్లలోని పలు హాస్టళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గార్లలోని బీసీ బాలికల వసతిగృహం, కస్తూర్బాగాంధీ పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం మంచిగా పెడుతున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని సూచించారు. అలాగే విద్యార్థుల టాయిలెట్లు, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు చలికాలంలో ప్రభుత్వం అందించే రగ్గులు, దుప్పట్లను వెంటనే అందజేయాలని సూచించారు. అనంతరం గార్ల ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర సర్వే దరఖాస్తుల డేటా ఎంట్రీల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డీపీఓ వెంట ఎంపీడీఓ మంగమ్మ, డీటీ జర్పుల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి అజ్మీర కిషన్, రమేష్, వార్డెన్లు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. మహిళలకు శాపం

- మహిళా సంఘం లీడర్లు వ్యక్తిగత రుణం తీసుకున్నట్లు చూపిస్తున్న బ్యాంకు సిబ్బంది
- మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్న సభ్యులు
- సమస్యను పరిష్కరించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రూపు సభ్యులు, లీడర్లు (ఫైల్)

మహబూబాబాద్: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం.. మహిళా సంఘం సభ్యులకు శాపంగా మారింది. గ్రూపు సభ్యులందరూ రుణం తీసుకోగా బ్యాంక్ సిబ్బంది లీడర్ల ఆధార్‌కు రుణాన్ని లింక్ చేశారు. దీంతో లీడర్లు వ్యక్తిగత రుణం తీసుకున్నట్లు చూపిస్తుండటంతో కిస్తీలు చెల్లించడం మానేశారు. ఫలితంగా లీడర్లకు, గ్రూపు సభ్యులకు మధ్య గొడవ ప్రారంభమైంది. ఈ సమస్యను సంబంధిత అధికారులు, బ్యాంక్ సిబ్బంది పరిష్కరించకపోవడంతో గ్రూప్ సభ్యులు రోడ్డెక్కారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. 90 మంది ఆర్పీలు పని చేస్తున్నారు. నాలుగు మున్సిపాలిటీలకు 2,600 మహిళా సంఘాల్లో సుమారు 25,000 మంది సభ్యులు ఉన్నట్లు మెప్మా డీఎంసీ విజయ తెలిపారు. కాగా మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమహలక్ష్మి గ్రూపు ఆరు నెలలు క్రితం బ్యాంక్‌లో రుణం తీసుకున్నారు. ఇద్దరు లీడర్లతో పాటు 8 మంది సభ్యులు మొత్తం పది మంది ఉంటారు. గ్రూపు లీడర్ జి.మనీషా, సెకండ్ లీడర్ డి.సరితతో పాటు గ్రూపు సభ్యులు ఆర్పీ పద్మ ఆధ్వర్యంలో రూ.13.40 లక్షల రుణం తీసుకున్నారు. మొదటి లీడర్ రూ 1,65,000 రెండో లీడర్ రూ. 1,50,000 తీసుకోవడంతో పాటు పది మంది సభ్యులు కలిసి పొదుపు నిమిత్తం రూ.లక్ష పక్కకు పెట్టి వారి పొదుపు ఖాతాలో జమ చేశారు. మూడు నెలలు పాటు గ్రూపు చెల్లింపు సజావుగానే జరిగింది.

వ్యక్తిగత రుణం కోసం వెళ్తే..

మొదటి లీడర్ మనిషా వ్యక్తిగత రుణం కోసం వేరే బ్యాంకుకు వెళ్తే మొదటి, రెండో లీడర్ పేరున రూ.13.40లక్షల రుణం తీసుకున్నట్లు ఉందని బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో ఆ లీడర్లు రుణం తీసుకున్న బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీయగా ఆధార్ లింక్ చేయగా అలా వస్తుందని తెలిపారు. ఆనాటి నుంచి మూడు నెలలుగా లీడర్లు కిస్తీలు చెల్లించడం లేదు. దీంతో లీడర్లకు, సభ్యులకు గొడవ మొదలైందని ఆర్పీ పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ఈ నెల 21న గ్రూప్ లీడర్లతో పాటు సభ్యులు కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మెప్మా డీఎంసీ విజయ, ఆర్పీలు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అయితే మూడు నెలలుగా లీడర్లు కిస్తీలు చెల్లించకపోవడంతోనే సమస్య వచ్చిందని, అధికారులు సైతం సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని సభ్యులు వాపోయారు.

పూర్తిగా చెల్లించాలి..

గ్రూప్ సభ్యులు తీసుకున్న రుణం మొత్తం చెల్లిస్తేనే క్లోస్ చేస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. - పద్మ, ఆర్పీ

సమస్య పరిష్కరిస్తాం..

శ్రీమహాలక్ష్మి గ్రూప్ సభ్యుల సమస్యను బ్యాంక్ సిబ్బందితో మాట్లాడాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. బ్యాంక్ సిబ్బంది తప్పిదంతోనే సమస్య వచ్చింది. త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. - విజయ, డీఎంసీ

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా టాస్క్ రిలేషన్ షిప్ మేనేజర్ ఎం. రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు స్కిల్స్, నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి టాస్క్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీంతో భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ సాంబశివరావు, ఐక్యూసి కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు రామన్న, శ్రీనివాస్, వినోద్, అన్నపూర్ణ, హతిరామ్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్



మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ అన్నారు. శనివారం కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ గేట్ ఎదుట యూనియన్ డీజిల్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్‌కె. జానీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డిసెంబర్ 4, 5వ తేదీల్లో జరిగే వన్ యూనియన్ వన్ ఇండస్ట్రీయల్ ఎన్నికల్లో జెండా గుర్తును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీజిల్ బ్రాంచ్ సెక్రటరీ పి.వేదప్రకాశ్, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ యాదగిరి, నరేశ్‌యాదవ్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తిరుపతి, గుర్రం నాగరాజు, దువ్వ వెంకట్, అశోక్, ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలు శనివారం (పురుషులు, మహిళలు) హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో నిర్వహించారు. ఈ పోటీలను కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య ప్రారంభించారు. ఫిజికల్ డైరెక్టర్లు సునీల్‌రెడ్డి, అంబాల రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 27 మంది పురుషులు, 25 మంది మహిళలు ప్రతిభ చాటారు. విజేతలను సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేసినట్లు వెంకయ్య తెలిపారు.

పరీక్షలు సాగేనా..ఆగేనా?

విడుదలకాని రీయింబర్స్‌మెంట్ బకాయిలు

- ఈనెల 26 నుంచి డిగ్రీ పరీక్షలు
- వాయిదా వేయాల్సిందేనని ప్రైవేట్ యాజమాన్యాల డిమాండ్
- నిర్వహిస్తామంటున్న అధికారులు
- డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో అయోమయం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని ఈనెల 19 నుంచి యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తున్నాయి. ఆయా యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి నిరవధిక బంద్ చేస్తున్నామని నోటీసు కూడా ఇచ్చిన విషయం విదితమే. రెండేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 90శాతం కళాశాలలు నాలుగైదు నెలలుగా అధ్యాపకులకు, ఇతర సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గత నెల 14వ తేదీనుంచి కూడా కళాశాలలు బంద్ చేయగా 17న విద్యాశాఖ సెక్రటరీ ఆయా యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులతో మాట్లాడారు. వారం రోజుల్లో విడుదల చేస్తామని చెప్పి చెల్లించకపోవడంతో మళ్లీ ఈనెల19నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు కూడా బంద్‌ను పాటిస్తున్నాయి.

214 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం 214 ప్రైవేట్ డిగ్రీ, 41 పీజీ కళాశాలలున్నాయి. 52 కళాశాలల్లో ఈ ఏడాది అసలు విద్యార్థులే చేరలేదు. మొదటి సంవత్సరంలో 46,169 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ నుంచి రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. ఆయా కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.162 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.



వీసీకి నోటీసు అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు (ఫైల్)

ఫీజుల చెల్లింపులో జాప్యం

కేయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రతి విద్యాసంవత్సరం స్టూడెంట్ రికగ్నైషన్ ఫీజు, ప్రాసెసింగ్, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్, స్పోర్ట్స్ ఫీజు యాజమాన్యాలు చెల్లించాల్సింటుంది. ఈ విద్యా సంవత్సరంలో 2024–25 చెల్లించాల్సిన ఫీజులు చెల్లించేందుకు జాప్యం చేస్తున్న పరిస్థితి ఉంది. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఆ ఫీజులతో పాటు డిగ్రీ సెమిస్టర్ల పరీక్ష ఫీజులను కూడా మినహాయించి పరీక్షలు నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు వీసీని, రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసి విన్నవించాయి. ప్రతి ఏడాది కేయూకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.12 నుంచి రూ.13 కోట్లవరకు ఫీజుల రూపేణ వస్తుందని తెలుస్తోంది. పరీక్ష ఫీజులు మాత్రం ఎక్కువశాతం కళాశాలలు చెల్లించాయి.

డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు జరిగేనా?

కేయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26నుంచి నిర్వహించేందుకు పరీక్షల విభాగం అధికారులు ఇప్పటికే టైం టేబుల్ విడుదల చేశారు. ఈ నెల 21న పరీక్ష కేంద్రాల జాబితాను విడుదల చేశారు. అయితే ఈపరీక్షలు జరిగేనా అనే అంశంపై అనుమానాలున్నాయి. నిరవధిక బంద్ నేపథ్యంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లోనూ పరీక్ష కేంద్రాలున్నాయి. అందువల్ల వారు సహకరించకపోతే ఆయా పరీక్షలు జరిగే అవకాశం లేదు. తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల అయ్యేవరకు పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. అంతేగాకుండా వివిధ కళాశాలల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు సైతం నిర్వహించడం లేదు. టైంటేబుల్ ప్రకారం పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి చెబుతున్నారు.

మంత్రి భట్టి విక్రమార్కతో చర్చలు

రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు బంద్ పాటించడంతో ఇటీవల ఆర్థిక శాఖమంత్రి భట్టి విక్రమార్కతో హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి సమక్షంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు చర్చించినట్లు సమాచారం. 15రోజుల్లో నాన్ ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి కొంత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని, కళాశాలలను తెరవాలని మంత్రి అసోసియేషన్ బాధ్యులను కోరారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వివిధ సెమిస్టర్ల పరీక్షలు జరుగుతుండగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ మాత్రం డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశారని సమాచారం. అయితే కేయూ పరిధిలో ఈనెల 26న నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నప్పటికీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మాత్రం వాయిదా వేయాల్సిందేనని అంటున్నాయి. దీంతో ఆయా పరీక్షలు జరుగుతాయా..లేదా? అని విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. పరీక్షలు నిర్వహణ కూడా సాధ్యంకాదని, అందుకే డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా వేయక తప్పదనే అంశం ప్రచారంలో ఉంది.

ఘాతుకానికి పాల్పడిన వారిని వదలం

- ములుగు ఎస్పీ శబరీశ్
- బాధిత కుటుంబాలకు పరామర్శ



అర్జున్ కుటుంబంతో మాట్లాడుతున్న ఎస్పీ

వాజేడు: అమాయకులు ఉయిక రమేశ్, ఉయిక అర్జున్‌ను మావోయిస్టులు హత్య చేయడం దుర్మార్గమని, ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలి పెట్టబోమని ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. శనివారం మండలంలోని పెనుగోలు కాలనీలో బాధిత కుటుంబాలతో విడివిడిగా మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించిన విషయాలను రమేశ్ భార్య రాంబాయి, అర్జున్ భార్య సావిత్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఇరు కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. రెండు కుటుంబాల పిల్లలతో మాట్లాడుతూ ఉన్నతంగా చదువు కోవాలని, ఏ అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సహకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు వస్తాయని, వాటిని త్వరగా ఇప్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం కూడా వచ్చేలా చూస్తామని ఇరు కుటుంబాల వారికి చెప్పారు. ఎలాంటి సంబంధం లేని అమాయకులను చంపడం బాధాకరమన్నారు. ఎస్పీ వెంట వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఉన్నారు.

మావోయిస్టుల తీరుపై మండిపాటు



ర్యాలీ నిర్వహిస్తున్న గొత్తికోయ గిరిజనులు

- దుశ్చర్యను ఖండిస్తూ గొత్తికోయ గిరిజనుల భారీ ర్యాలీ

ఏటూరునాగారం : ములుగు జిల్లా వాజేడు మండలం బాలలక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉయిక అర్జున్, ఉయిక రమేశ్‌ను మావోయిస్టులు నరికి చంపడంపై పెనుగోలు, బాలలక్ష్మీనగరం గొత్తికోయ గిరిజనులు మండిపడ్డారు. మావోయిస్టుల దుశ్చర్యను ఖండిస్తూ శనివారం ఏటూరు నాగారం హనుమాన్ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు సుమారు 3వేల మంది భారీ ర్యాలీ నిర్వహించారు. 'మావోయిస్టులు డౌన్.. డౌన్, మావోయిస్టుల మా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు' అని నినాదాలు చేశారు. అనంతరం మూసికి మోటు, కోసి, సుధాకర్ మాట్లాడుతూ తాము బతుకుదెరువు నిమిత్తం తెలంగాణకు వలస వచ్చామన్నారు. పెనుగోలు గుట్టమీద నుంచి కిందికి వచ్చి గ్రామంలో ఉంటూ కష్టం చేసుకొని జీవిస్తున్న తమపై మావోయిస్టులు దాడులు చేయడం, నరికి చంపడం సరికాదన్నారు. పోలీసులు తమకు సహకరించడం లేదన్నారు. మావోయిస్టులు తమను చంపుతున్నారని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలన్నారు. మావోయిస్టులు తమ ఉనికి చాటుకోవడానికి అమాయకులైన గిరిజనులు చంపుతున్నారన్నారు. గొత్తికోయ గిరిజనులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. దాడులు ఆపకపోతే సహించేది లేదన్నారు. గొత్తికోయ గిరిజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కాగా, గొత్తికోయల బంధువులు ఛత్తీస్‌గడ్ నుంచి వచ్చి ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

గాయంతో పతకం కోల్పోయా..

- అంతర్జాతీయ క్రీడాకారిణి అరుణ
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ఆటల ఉత్సవం



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: వరుసగా ఐదు పర్యాయాలు ప్రపంచ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొన్నా.. ప్రతిసారి కాలుకు గాయం కావడంతో పతకాలు సాధించలేకపోయానని అంతర్జాతీయ క్రీడాకారిణి అరుణ బుద్దారెడ్డి అన్నారు. ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శనివారం గ్రామీణ ఆటల ఉత్సవం నిర్వహించారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ క్రీడల్లో నిర్వహించిన పోటీలకు అరుణ బుద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. 2018లో మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి పాల్గొని టేబుల్ వాక్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. 2019 నుంచి 2023 వరకు వివిధ దేశాల్లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ప్రతీసారి కాలుకు తీవ్రగాయం కావడంతో లక్ష్యం చేరుకోలేకపోయానన్నారు. ఈశా ఫౌండేషన్ వలంటీర్ శిరీష మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 22 వాలీబాల్ జట్లు, 12 త్రోబాల్ జట్లు పాల్గొన్నాయన్నారు. వాలీబాల్‌లో పడిగాపూర్ గెలుపొందగా రన్నరప్‌గా నీరుకుళ్ల నిలిచిందని తెలిపారు. త్రోబాల్‌లో కమలాపూర్ గెలుపొందగా, రన్నరప్‌గా శాయంపేట నిలిచిందన్నారు. డిసెంబర్ 28న సద్గురు సమక్షంలో కోయంబత్తూర్ లోని ఆదియోగి స్టేడియంలో ఫైనల్ జరుగుతుందని తెలిపారు. ముగింపు వేడుకలకు ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి హాజరై వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ. పదివేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఈశా ఫౌండేషన వలంటీర్లు వేణుగోపాల్, రమాకాంత్, సింధు, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు శ్రీధర్, అసోసియేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



పోటీలో తలపడుతున్న జట్లు

కేయూక్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీయెట్ క్రికెట్ (పురుషుల) (ఉమ్మడి వరంగల్‌జిల్లా) పోటీలు రెండో రోజు శనివారం కేయూ క్రీడామైదానంలో కొనసాగాయి. ఈనెల 24న జరిగే సెమీ ఫైనల్స్‌లో వరంగల్ కిట్స్ కాలేజీ, యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ జట్లు తలపడబోతున్నాయి. కాగా, హనుమకొండ వాగ్దేవి కాలేజీ జట్టు ఫైనల్‌కు చేరుకుందని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పి. భాస్కర్, వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మారినేని ఉదయ్‌భానురావు, పీడీలు మహ్మద్ అఫ్జల్, మట్టెడకుమార్, అస్లాం, మధుకర్ , పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహన్‌కృష్ణ,రాము, ప్రభాకర్, ఎం. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య పర్యవేక్షించారు.

పంచారామాలకు సూపర్ లగ్జరీ బస్సు



కాజీపేట అర్బన్ : కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం పంచారామ దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని పంచారామ క్షేత్రాలు అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి, భీమవరంలోని సోమేశ్వర స్వామి, పాలకొల్లులోని క్షీరలింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి, సామర్లకోటలోని భీమేశ్వరస్వామి దేవాలయాలను దర్శించుకునేందుకు ఈనెల 27వ తేదీన లగ్జరీ బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈనెల 27వ తేదీన సాయంత్రం 6 గంటలకు హనుమకొండ బస్సు స్టేషన్ నుంచి బయలుదేరి గురువారం పంచరామ దర్శనం అనంతరం శుక్రవారం ఉదయం తిరిగి హనుమకొండ బస్సు స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. పంచారామ దర్శనానికి పెద్దలకు రూ. 2300, పిల్లలకు రూ. 1400 చార్జీ ఉంటుందని, బుకింగ్ కోసం సర్వీస్ నంబర్ 94444 ద్వారా ఆన్‌లైన్‌లో tgsrtconline.in, వివరాలకు 7382855492, 9959226056, 9959226047 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

12 గంటల నిర్విరామ హ్యాక్‌థాన్

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో 12 గంటల పాటు హ్యాక్‌థాన్ నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రజిత్ గుప్తా మాట్లాడారు. విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దడానికి హ్యాక్‌థాన్ ఎంతో దోహదపడుతోందన్నారు. సీ ప్రోగ్రామింగ్‌పై మరింత శ్రద్ధ పెంపొందిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ శశికళ, డాక్టర్ సురేశ్, సబ్జెక్ట్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, డాక్టర్ మీనాక్షిషా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

కాడెద్దుకు కన్నీటి వీడ్కోలు..

కేసముద్రం: ఎడ్లజతే ఆ రైతుకు జీవనాధారం. ట్రాక్టర్లతో పొలం దున్నిస్తున్న ఈ కాలంలో ఆ జత ఎడ్లతో ఐదు ఎకరాలు సాగు చేశాడు. అందులో ఓ ఎద్దు చనిపోగా, కుటుంబ సభ్యుల మాదిరి దానికి అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అనుగుల నర్సయ్య, నిర్మల రైతు దంపతులకు రెండు కాడెడ్లు ఉన్నాయి. తమకున్న రెండెకరాల్లో వరి పంట వేయగా, 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. శనివారం ఆ భూమిలో మొక్కజొన్న సాగు చేసేందుకు కాడెడ్లతో దున్ని విత్తనాలు వేశారు. మధ్యాహ్న సమయంలో కాడెడ్లను వ్యవసాయబావి సమీపంలోని గడ్డివాము వద్ద ఉన్న చెట్టుకు కట్టేశారు. అందులో ఓ ఎద్దు తాడు తెంపుకుని పచ్చిగడ్డి మేస్తూ బావి వద్దకు వెళ్లి జారి అందులో పడింది. మెడకు ఉన్న తాడు బిగుసుకుని మృత్యువాతపడింది. కొద్దిసేపటి తరువాత రైతు దంపతులు అక్కడికి రాగా, అప్పటికే బావిలో పడి మృత్యువాత పడిన దృశ్యం చూసి బోరున విలపించారు. నాలుగేళ్లుగా సాకుతున్న ఎద్దు చనిపోవడంతో మనిషి మాదిరి అంత్యక్రియలు (ఖననం) జరిపి కన్నీటి వీడ్కోలు పలికారు.



ఎద్దుకు అంత్యక్రియలు చేస్తున్న రైతు దంపతులు

సంతానం కలగడం లేదని మనస్తాపంతో..

- వివాహిత ఆత్మహత్య
- చిట్యాలలో ఘటన



ప్రశాంతి (ఫైల్)

పెద్దవంగర: వివాహమై ఏడాది దాటినా సంతానం కలగలేదు. దీంతో అమ్మా.. అని పిలిపించుకోలేకపోతున్నానే కారణంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాలలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనపురం ప్రశాంతి (27)కి ఇదే గ్రామానికి చెందిన అనిల్‌తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తనతో పాటు పెళ్లైన వారికి సంతానం కలగగా తనకు మాత్రం కలగడం లేదని మనస్తాపానికి లోనైన ప్రశాంతి.. భర్త పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి రగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSION

■ Admission for guidence ఇంటర్, డిగ్రీ, పీజీ, B.Tech, LLB, B.Sc, అగ్రి, GNM, BHMS, BAMS, BNYS, BPT, D.ఫాం, B.ఫాం. 9494903629, 7660043034 కొన్ని సీట్లు మాత్రమే. [W-1239947]

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్‌రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1264026]

PLOT FOR SALE

■ Registered Plot for Sale 600 Sq.Yds. Waddepalli Filter Bed to Devannapet Road, beside Rly Tracks. Cont: 9666734597, 7997226436. [W-1239944]

■ హనుమకొండ కాజీపేటలో 413 చదరపు గజాల ప్లాటు అమ్మబడును. వెజిటేబుల్ మార్కెట్ దగ్గర (నో బ్రోకర్) డైరెక్ట్ పార్టీ సంప్రదించండి. సెల్: 9849129772. [W-1239932]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సెల్: 8341479342. [WA-7546]

సర్టిఫికేట్స్ పోయినవి

■ KOTA PRAVEEN, S/o. Kota Rameshవి NIT Warangal B.Tech (Civil) 1st Semester Grade sheet Original Certificates కొత్తపల్లి నుండి కునూర్‌కి వెళ్తుండగా దారిలో ఎక్కడో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలుపగలరు. సెల్: 9618829345. [W-1264031]

RESTAURENT FOR SALE

■ వరంగల్ ఖమ్మం మెయిన్‌రోడ్డుకి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా గల బాలాజీ రెస్టారెంట్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. సంప్ర॥ 7396077320, 9440761222. [W-1264022]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1264013]

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1264019]

PEST CONTROL

■ చెదలు & బొద్దింకల నివారణ & మీ విలువైన ఇండ్లకు & కొత్తగా నిర్మించే భవనములకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేయబడును. వాటర్ ప్రూఫింగ్ సర్వీసెస్ – GHANA SRI. Cell: 9676982085 [W-1239943]

CHANGE OF NAME

■ నేను, జిన్నె సమేత జీవిత భాగస్వామి నెం.2624893F ర్యాంక్ సిపాయి పేరు బిర్రు సతీష్ R/o. పెద్ద కోర్పోలు విలేజ్ & పోస్ట్, నెక్కొండ Tk, వరంగల్ జిల్లా. అఫిడవిట్ ప్రకారం నా పేరు జిన్నె సమేత నుండి బిర్రు సమేతగా మార్చుకున్నాను. [HA-14783]

BUSINESS OFFER

■ ధాన్యం ధాన్యం,బియ్యం బియ్యం!డైలీ అధిక మొత్తంలో కొంటాం, మాది అతిపెద్ద రైస్ & ఫుడ్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్, ధాన్యం & రైస్ వ్యాపారస్తులు &మక్కలు,పల్లీలు&ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్‌మిల్లర్లు,మీడియేటర్లు డైరెక్ట్.8008251356 [HA-2425]

WANTED

■ రత్నశ్రీ ఫర్నీచర్‌లో షాపు చూసుకోవడానికి Married Ladies కావలెను. 10AM to 7PM వరంగల్ హాస్పిటల్ ఎదురుగా D-Mart కుడి ప్రక్కన Cell: 8106683662. [W-1264028]

■ OPERATION THEATOR BOYS, Medical Shop Assts & Computer Operators/ Administrators / Supervisors required. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2pm. [WA-453]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073. [SCA24000672]

■ హనుమకొండ ములుగు రోడ్ నందు గల కళాశాలలో వంట సెక్షన్‌లో పనిచేయుటకు భార్యభర్తల జంట (ఇద్దరు) మరియు నలుగురు ఆడవారు కావలెను. ఆకర్షనీయమైన జీతంతో పాటు వసతి సదుపాయం కలదు. సంప్ర॥ 9985211479 [WA-14734]

■ షిరిడి సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14774]

■ డిసెంబర్ రెండవ వారంలో అమెరికా వెళ్ళుతున్న మాకు ఇంటి పనులు చేయుటకు 40–50 సం॥ వయస్సు గల ఆడ మనిషి కావలెను. USA విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ఫోన్: 8121742155 [HA-99095]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.